అడల్ట్స్ ఓన్లీ కథ

# 1433

చంప

సుందర్ అపార్ట్‌మెంట్ రెండో ఫ్లోర్ రెండో ఫ్లాట్ కిటికీ తెరిచి చూస్తే సుందరి అపార్ట్‌మెంట్ రెండో ఫ్లోర్ రెండో ఫ్లాట్‌లోని విశేషాలన్నీ కనిపిస్తాయి. అందులో నడయాడే అప్సరతో సహా!

క్రమబద్ధీకరణ సాకుతో నిబంధనలు పాటించకుండా ఇష్టం వచ్చినట్లు కట్టుకున్న ఆ రెండు అపార్ట్‌మెంట్ల మధ్య దూరం ఆరు అడుగులు కూడా ఉండదు. ఏ సాహసి అయినా ఇటు బాల్కనీలోంచి అటు బాల్కనీలోకి దూకవచ్చు. లేదా పిట్టగోడలమీద బ్రిడ్జి లాగ ఒక బల్లను పరిచి స్టైల్‌గా నడిచి వెళ్ల వచ్చు!

సుందరి అపార్ట్‌మెంట్‌లోని రెండో ఫ్లోర్ రెండో ఫ్లాట్‌లో సుందరి మంచంమీద బోర్లా పడుకుని రెండు కాళ్లు పైకి మడిచి ఐపాడ్‌లో వస్తున్న పాటకనుగుణంగా పట్టాల మువ్వలు ఘల్లుఘల్లుమనేట్టు ఎడమ పాదాన్ని కుడిపాదంతో తట్టుతూ వీక్లీ చదువుకుంటోంది. మోకాళ్లవరకు చీర తొలగిపోగా పదగెత్తి సరాగాలాడుకుంటున్న రెండు శ్వేతనాగుల్లాగ ఉన్నాయామె కాళ్లు. ఆ సౌందర్యాన్ని తనివితీరా ఆస్వాదిస్తున్న అతడు చిన్నగా శబ్దం చేయగా ఉలికిపడి చటుక్కున లేచి నిలుచుందామె. చూపులు కలిసిన ఆ శుభవేళ రెండు మనసులు ఒకటి అయాయో లేదో గాని నాలుగు కనులూ ఒకటి అయి ఓ క్షణం ఊసులాడుకున్నాయి.

ఎదురుగా చేతులు కట్టుకొని నిలబడ్డ అతని ముఖంలో చిరునవ్వు చిందులేస్తోంది. కండలు తిరిగిన శరీరం టీ షర్ట్‌లో ఒదగలేనంటోంది. షర్ట్‌మీద ముద్రించబడివున్న 'హాయ్! బ్యూటీ!' అన్న అక్షరాలు ఆమెనే పలకరిస్తున్నట్టున్నాయి.

హఠాత్తుగా మంచంమీద నుంచి లేవడంతో పూర్తిగా తొలగిన పైట ఆమె ఘన వక్ష సంపదను అతనికి కనువిందు చేసింది. బికినీలో భామలు సెక్సీగా ఉంటారని యువత భావం కాని చీరకట్టులోని మజా కొందరే ఆస్వాదించగలరు. బికినీలో అంతా బహిరంగమే. అయితే ఎక్కడ బహిరంగ పరచి ఎక్కడ మరుగుపరచాలో చీరకు తెలిసినట్టు బికినీకి తెలియదు.

చటుక్కున ఆమె పైట సవరించుకున్నా- కలశం లాంటి చిట్టి పొట్ట, ఆ కలశం మీద బొట్టులాగ ఆమె నాభి, కలశం చుట్టూ అల్లిన పసుపుదారాల్లాగా ఆమె నాభి చుట్టూ చమక్కుమంటున్న టాటూలను ఆ పైట కప్పి ఉంచలేకపోయింది. శంఖం లాంటి ఆమె స్నిగ్ధ కంఠాన్ని దాచిపెట్టే సాహసం ఏ ఆభరణాలకుంది? మధువొలకబోసే అధరాల్ని లిప్‌స్టిక్ మరుగు పరచగలదా? కవ్వించే నున్నని గుండ్రని భుజాల్ని పొట్టి చేతుల జాకెట్ కప్పి ఉంచ లేకపోతోంది.


వావ్! వాట్ ఎ బ్యూటీ! అని గంతులేసిందతని హృదయం.

"ఏయ్! ఎవరు నువ్వు? అడుగుతోంటే చెప్పవేం?" మూడోసారి గద్దించిందామె.

అతగాడు వినయంగా వంగిపోతూ "నా పేరు సుహాసిని! ఫ్రెండ్స్ సుహా అని పిలుస్తారు. యంసీఏ పాసై క్యాంపస్ ఇంటర్వ్యూలో సెలక్ట్ అయి ఉన్నాను. ఒకటి రెండు నెలల్లో కాల్ లెటర్ వస్తుంది. వయసు ఇరవై రెండు. ఎత్తు **176** బరువు **58** కొలతలు **84-60-88**" చిలిపిగా అన్నాడు.

"అరే! అదంతా నా బయోడేటా!" ఆశ్చర్యంగా అరిచినట్టు అందామె.

"అయితే **84-60-88** కరెక్టేనా?" కొంటెగా నవ్వాడు.



"అది కాదు, అదికాదు! మిగిలిన దేటా!" కోపంగా అరవాలనుకుంది గాని ఆమె స్వరం మెత్తగా మారి చివరకు సిగ్గుల మొగ్గ అయి బుంగమూతిగా మారింది.

ఉద్యోగులైన అమ్మా, నాన్నా ఆఫీసులకు వెళ్లిపోగా నాయనమ్మ ఏదో గదిలో కునుకుతీస్తోంది కాబోలు... ఫ్రంట్ డోర్ బోల్టు వేసే ఉంది. ఒంటరిగా ఉన్న అమ్మాయి గదిలో హఠాత్తుగా ప్రత్యక్షమైన ఆ యువకుడు దొంగగాని రేపిస్ట్ గాని కావచ్చు. భయపడవలసిన సందర్భమే. కాని విచిత్రంగా ఆమెకు భయం కలగలేదు. థ్రిల్లింగ్‌గా ఫీల్ అయింది.

"ఎవరు నువ్వు? లోనికెలా వచ్చావ్?" కాస్త కోపంగానే అడిగిందీసారి.

"మీ వెనకభాగం, నా వెనకభాగం ఎదురెదురుగా ఉన్నాయి" అతడింకా ఏదో చెప్పబోతుండగా ఆమె ఖస్సుమంది.

"సారీ! మీ ఫ్లాట్ వెనక భాగం, మా ఫ్లాట్ వెనక భాగం ఎదురెదురుగా ఉన్నాయి. మీరు కొత్తగా ఈ ఫ్లాట్‌లోకి వచ్చారు కాబట్టి మీకు తెలియకపోవచ్చు. కానీ ఇటువైపు తలుపులు, కిటికీలు ఎవరూ తెరిచి ఉంచుకోరు మీరు తప్ప. మా ఫ్లాట్‌లోంచి తరుచుగా మిమ్మల్ని చూస్తూనే ఉన్నాను. పోనీలే ఒకసారి పలకరించిపోదామని ఇలా వచ్చాను" వినమ్రంగా చెప్పినా అతని గుండెలోతుల్లోంచి చిరునవ్వు తన్నుకొస్తోంది. స్వరంలో కొంటెదనం, కళ్లలో చిలిపిదనం!

"అది సరే, మీరు లోనికెలా వచ్చారు?"

"నేను వెళ్లేటప్పుడు చూద్దురుగాని ఎలా వచ్చానో!" అని నవ్వేసి "మిగతా భాగం రేపు సాయంకాలం నాలుగు గంటలకు వరలక్ష్మి ఆలయం వద్ద" అంటూ చటుక్కున బ్యాక్‌డోర్ తెరిచి బాల్కనీలోకి వెళ్లి ఒక్క అంగలో పిట్టగోడ ఎక్కి రెప్పపాటులో అటువైపు బాల్కనీలోకి జంప్ చేశాడు.

సుహా గుండె గుభేల్‌మంది. అతడు దూకడంలో ఒక్క సెంటీమీటర్ తేడా వచ్చినా ఒక్క సెకను విలంబం జరిగినా కిందపడి ప్రాణాలు కోల్పోయేవాడే. గుబగుబలాడుతున్న గుండెను అదుముకుంటూ ఓ క్షణం అక్కడే నిలబడిపోయిందామె. ఇదంతా దిగ్భ్రాంతిగాను థ్రిల్లింగ్‌గానూ ఉంది. తలుపు మూసి మంచం మీద వాలిపోయింది.

ఎందరో అబ్బాయిలతో ఆమెకు పరిచయం వుంది. క్లాస్‌మేట్స్ తనంటే పడిచచ్చేవారు. కానీ వాళ్లెవరూ తన హృదయాన్ని స్పందింపజేయలేకపోయారు. కానీ ఇప్పుడు తన హృదయానికేమయిందోగాని ఇతగాడు గుండెల్లో చొరబడ్డాడు. భావోద్వేగంతో జాకెట్ హుక్స్ ఊడిపోయేట్టున్నాయి. అతని సాహసోపేత లాంగ్‌జంప్ మళ్లీ మళ్లీ ఆమె కళ్ల ఎదుట కనిపిస్తూ అబ్బుర పరుస్తోంది.

టైమ్ పన్నెండు గంటలు కాగానే ఉద్వేగాన్ని అణచుకుంటూ పక్కగదిలో వాలుకుర్చీలో కునికిపాట్లు పడుతున్న నాయనమ్మని లేపి భోజనం వడ్డించింది. ఆమె కూర అడిగితే పప్పు ఇచ్చింది. చారు అడిగితే మజ్జిగ పోసింది.

"ఏం పిల్లా! ప్రేమలోపడ్డావా?" బోసినవ్వు నవ్వింది నాయనమ్మ. సుహా చెంపల నుంచి కెంపులు రాలాయి. తేనెవానలో తడిసినట్లు హృదయం మధురోన్మత్తంగా ఉంది. గుండెల్లోంచి కూనిరాగం ఎగసెగసి వస్తోంది.

నిజంగా తను ప్రేమలోపడిందా? ఛీ ఛీ! అతడితో పరిచయం, ఒక పావుగంట! పావుగంటలోనే ప్రేమ ఏమిటి? నాన్సెన్స్! తొలిచూపులోనే ప్రేమ అనే సిద్ధాంతంలో ఆమెకు నమ్మకం లేదు. తొలిచూపులో కలిగేది కామం. ప్రేమ కానే కాదు. కానీ తనెందుకు వివశం అయిపోతున్నది.



## నేనే గ్రేట్!

**ఈ ఏడాది సక్సెస్‌ఫుల్ చిత్రాల హీరోయిన్‌గా తనే ముందున్నానని తెగ సంబరపడిపోతోంది జెనీలియా. 2008లో తమిళ 'బొమ్మరిల్లు', హిందీలో 'జానేతూ జానేనా', తెలుగులో 'రెడీ', కన్నడంలో 'సత్య'.. ఇలా నాలుగు భాషల్లో నాలుగు హిట్లు కొట్టిన జెనీలియా మరి గర్వంగా ఫీలవక ఏం చేస్తుంది చెప్పండి. అందుకనే మోస్ట్ సక్సెస్‌ఫుల్ హీరోయిన్‌గా తనకి తను గొప్పగా చెప్పుకుంటూ ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయిపోతోంది. కాదా మరి!**

కండలు తిరిగిన ఆ శరీరం, చెక్కు చెదరని ఆ చిరునవ్వు, కవ్వించే చిలిపిదనం మాటిమాటికీ జ్ఞాపకం వస్తూ తనని నిలబడనీయడం లేదు ఎందుకని? రేపు ఆలయం వద్దకు రమ్మన్నాడు. నాన్సెన్స్! ఎవడో పిలిస్తే తను వెళ్లిపోతుందా? నెవర్!

☆ ☆ ☆

మర్నాడు సాయంకాలం మూడు గంటల వరకు ఆమె తన నిర్ణయం మీద స్థిరంగా ఉంది. కానీ మూడు దాటాక ఆమె మూడ్ ఊగిసలాడింది. మూడున్నరకు చటుక్కున లేచి చీర మార్చుకొని నాయనమ్మకి చెప్పి గుడికి బయలుదేరింది!

ఊరికి దూరంగా కొండమీద ఉంది వరలక్ష్మి ఆలయం. అమ్మవారి దర్శనానికి ఐదు వందల మెట్లు ఎక్కాలి. రాళ్లు పేర్చి ఏర్పరచిన మెట్లు అవి. దారి పొడవునా రక్షణకోసం రాళ్లు పేర్చిన పిట్టగోడ ఉంది. కాలక్రమంలో రాళ్లు జారిపోయి మెట్లు, పిట్టగోడ కూడా ప్రమాదకరంగా మారిపోయాయి. అందుకే వరలక్ష్మివ్రతం నాడు తప్ప అక్కడ జనసంచారమే ఉండదు.

ఇష్టంగా కష్టపడి మెట్లెక్కి అమ్మవారి దర్శనం చేసుకొని హుషారుగా పాతిక మెట్లు దిగి పిట్టగోడ మీద కూర్చుంది సుహా. ప్రియాన్వేషణలో దివినుంచి భువికి దిగివచ్చిన అప్సరలా ఉందామె.

అక్కడ నుంచి చూస్తే కుడివైపు

ఆలయం, ఎడమవైపు దూరంగా రంగు రంగుల లక్కపిడతల్లాగ కనిపిస్తున్న ఇళ్లు. అల్లిబిల్లి గీతల్లాగ రోడ్లు, చీమల బారుల్లాగా కదిలిపోతున్న వాహనాలు. కిందకు చూస్తే అమ్మో, గుండె గుభిల్లు! వృక్షాగ్రాలతో దట్టంగా అల్లుకున్న పొదలతో గగుర్పాటు కలిగించే అందమైన భయంకర లోయ!

ఆ పిట్టగోడ జీవన్మరణాల మధ్య సరిహద్దు రేఖలాగ కనిపిస్తోంది. ఎందుకంటే అక్కడనుంచి జారిపడితే మరణం తథ్యం!

ఆమె చుట్టూ ప్రకృతి మురిసిపోతూ ప్రేమోద్దీపన చేస్తున్నది. చిలిపి పిల్లగాలులు రెచ్చిపోయి మోహనగీతం ఆలపిస్తున్నాయి. ఆమె ఆలోచిస్తోంది.

తను అతడిని ప్రేమిస్తున్నదా? అది ప్రేమ అవునో కాదో గాని పావుగంట పరిచయంలోనే అతడు తనకు హాని తలపెట్టడనిపిస్తోంది. అతడు తన పక్కనుంటే ఎంతో ధైర్యంగా అనిపించింది. అతని మాటలు, చేష్టలూ చూస్తే అతనితో తను సుఖపడగలననిపిస్తోంది.

అతడెందుకు పిలిచాడు? ఏం చెప్పబోతున్నాడు?

ఆమె ఆలోచనలనుంచి తేరుకోనే లేదు. అంతలో హఠాత్తుగా...

"హల్లో! సుహా!"

ఆమె ఉలిక్కిపడి చూడటం, ఆ కదలికకు ఆమె చెయ్యి ఆనుకున్న రాయి దొర్లి భయంకరమైన శబ్దంతో జారుతూ లోయలో పడడం, బ్యాలన్స్ తప్పి ఆమె కూడా పడబోయేలోగా ఒక బలిష్ఠహస్తం ఆమె చేతిని ఒడిసిపట్టి ఆపటం - అన్నీ ఒకే క్షణంలో జరిగిపోయాయి.

తన చేతిలోని ఆమె చేతిని మురిపెంగా చూస్తూ "చూశావా సుహా! మన పాణిగ్రహణం జరిగిపోయింది" అన్నాడతడు.

ఏం జరిగిందో మొదట ఆమెకు అర్థంకాలేదు. అర్థం అయాక శరీరం గజగజ వణికిపోయి గుండె గుబగుబలాడింది. శరీరం అంతా చెమటపట్టేసి భయవిహ్వలంగా ఉన్న ఆమెను హృదయానికి హత్తుకొని జేబు రుమాలుతో ఆమె ముఖం అద్ది వీపు నిమిరాడు. క్రమక్రమంగా గుండె దడ తగ్గి ఆమె కోలుకొని, ఉలిక్కిపడి చటుక్కున అతనిని నెట్టేసి కొంచెం దూరంగా జరిగింది.

"నా పేరు రవి. యంబీఏ చేశాను. బ్యాంక్ మేనేజర్ని" అని పరిచయం చేసుకొని "ఐ లవ్ యు, సుహా!" అన్నాడు ఆర్తిగా.

అతనిని తేరిపార చూసింది సుహా. "కనీసం అరగంట పరిచయం కూడా లేని మన మధ్య ప్రేమ ఏమిటి? నాన్సెన్స్! వారం రోజుల్లో నన్ను చూడడానికి శంకర్ వస్తున్నారు. అతనితో నా వివాహం ఖాయం అయినట్లే. అనవసర విషయాలతో నన్ను వేధించకండి, ప్లీజ్! ఈ విషయం చెప్పడానికే వచ్చాను" అంది అర్థింపుగా.

"ఆ శంకరాన్ని తన్ని తరిమేసి వాడి బదులు నేనే పెళ్లిచూపులకొచ్చి నిన్నే పెళ్లాడతా" అన్నాడు చిలిపిగా.

"మా పరువుబజారుకీడ్వవద్దు" రెండు చేతులూ జోడించి నమస్కరించి వడివడిగా వెళ్లిపోయిందామె.

☆ ☆ ☆

పెళ్లి చూపులు...

అమ్మలక్కలు సుహాని అలంకరించి తీసుకొచ్చిన వరుని ఎదుట కూర్చోబెట్టి "కాబోయే మొగుడ్ని సరిగా చూసుకోవమ్మా" అని మేలమాడారు. సిగ్గుల మొగ్గలా కూర్చున్న సుహా వారి ప్రోద్బలంతో ముఖాన్ని కొద్దికొద్దిగా అలా అలా పైకెత్తి అతనిని చూసి షాక్ అయి దిగ్గున లేచి నిలుచుంది. "ఎందుకంత షాక్! నేనంత వికారంగా ఉన్నానా?" నవ్వుతూ అడిగాడతడు. అంతా ఘొల్లున నవ్వేసి ఆమెను కూర్చుండబెట్టారు.

'ఏమిటిది? రవి అన్నంత పనీ చేశాడా? శంకర్ని తరిమేసి తనే పెళ్లిచూపులకొచ్చేశాడా' ఇలాంటి ప్రశ్నల కొలిమి అయింది సుహా హృదయం.

కానీ పెద్దలు మామూలుగానే మాట్లాడుకుంటున్నారు. చూడవచ్చినవాడు మారిపోతే మాటల్లో తేడా వస్తుంది కదా. అదేమీ లేదు. ఇందులో ఏదో రహస్యం వుంది. తనెందుకు బయటపడాలని తెలుకుట్టిన దొంగలాగ గుంభనంగా ఉండిపోయింది సుహా.

అచ్చట్లు ముచ్చట్లు అయాక మాట్లాడుకోమని వాళ్లిద్దర్నీ టాప్ ఫ్లోర్ మీదకు పంపేశారు పెద్దలు. అక్కడ ప్రత్యేకంగా వేసిన కుర్చీల్లో కూర్చున్నాక "సుహా! నేను నీకు నచ్చానా?" మృదువుగా అడిగాడు రవి.


"ముందు ఇది చెప్పండి. శంకర్ని ఏం చేశారు? అతని బదులుగా మీరొస్తే ఎవరూ ఎందుకు నిలదీయలేదు?" సూటిగా అడిగింది సుహా.

"మేనేజర్ని కదా! మేనేజ్ చేశాను!" పకపకా నవ్వేశాడు రవి. కానీ ఆ నవ్వులోనూ ఏదో దాపరికమే.

"చెప్పండి ప్లీజ్" బతిమాలుతున్నట్లు అడిగింది.

కరిగిపోయాడు రవి.

"ఎలా మేనేజ్ చేశానంటే..నేనే రవి! నేనే శంకర్! వెరసి నా పేరు రవిశంకర్!" రహస్యం విప్పాడు.




ఆమె ముఖం విప్పారింది. మనసు పురివిప్పింది. సాయంకాలపు నీరెండ ఆహ్లాదకరంగా ఉంది. చల్లాచల్లని పిల్లగాలులు అల్లరి చేస్తున్నాయి. ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు రవి. ఆమె చెయ్యి లాక్కోలేదు.

"నిన్ను మా కిటికీలోంచి చాలాసార్లు చూశాను సుహా! నీ అందాన్ని రహస్యంగా చూస్తూనే ఉండేవాడిని. దైవికంగా మీ పెద్దలు మా వాళ్లని కలిసి పెళ్లిచూపులకు రమ్మని ముహూర్తం నిర్ణయించారు. పెద్దలు నిర్ణయించే పెళ్లిళ్ళు, పెళ్లిచూపులు, తొలి చూపులోనే ప్రేమ లాంటి విషయాల్లో నాకు నమ్మకం లేదు. అందుకే సాహసించి మీ బాల్కనీలోకి దూకి నీతో మాట కలిపాను. నేనంటే నీకిష్టమే అనిపించి ఆలయానికి రమ్మంటే వచ్చావు" అని కానసాగి "ఐ లవ్ యూ" అన్నాడు తమకంగా ఆమె చేతిని ముద్దుపెట్టుకుంటూ.

ఇదంతా కలలాగ ఉంది సుహాకి. పావుగంట పరిచయంలోనే ప్రేమా?! అనిపిస్తోంది.

"నిజమే నాకూ నమ్మబుద్ధి కావడం లేదు. కానీ నాది నిజమైన ప్రేమ అని నాకు తెలుస్తోంది. ఎందుకంటే బ్యాంక్ స్టాఫ్లో అయితేనేం, కస్టమర్లలో అయితేనేం అందమైన ఎందరో అమ్మాయిలతో నాకు పరిచయం వుంది. వారి మాటలూ, చేష్టలూ చూస్తున్నప్పుడు వాళ్లని ఏదో చేసెయ్యాలనిపిస్తుంది. నేనేం చేసినా వాళ్లు అడ్డుచెప్పరని నాకు తెలుసు. కానీ నా తల్లిదండ్రులు నాకు నేర్పిన సంస్కారం నన్ను తప్పటడుగు వెయ్యనివ్వలేదు. నిన్ను చూసినప్పుడు నాకేం అనిపించిందో తెలుసా?" కన్నుకొట్టి ఆమె వైపుచూస్తూ ఉండిపోయాడు.

'ఏమనిపించింది?' అని కళ్లతోనే ప్రశ్నించిందామె.

"నిన్ను చూసినప్పుడు నాలో ఏ అలజడీ లేదు. ఏ వికారమూ లేదు. మనసు ప్రశాంతంగా వుంది. నిన్నేదో చేసెయ్యాలనిపించలేదు. నీ కోసం, నీ పెదవులపై చిరునవ్వుకోసం, కళ్లలో మెరుపుకోసం, నీ ఆనందం కోసం ఏదైనా చెయ్యగలను అనిపించింది. గుడివద్ద నిన్ను కౌగలించుకున్నప్పుడు కూడా నీలో భయం తొలగించాలనే తలంపుతప్ప చెడు ఆలోచన కలగనే లేదు. నువ్వు నా దానవు. నీతో నేను హాయిగా ఉండగలను. నిన్ను హాయిగా ఉంచగలను అనిపించింది. అదే అసలైన ప్రేమకు నిర్వచనం అని స్ఫురించింది. అందుకే చెబుతున్నా, 1 4 3 అంటే ఐ లవ్ యూ" మరింత మృదువుగా మారిందతని స్వరం.

నిజానికి అతడు చెబుతున్నవన్నీ తన మనసులోని మాటలే అనిపించింది సుహాకు. ఇద్దరి అభిప్రాయాలూ ఇలా కలిసిపోవడమే ప్రేమంటే అనుకుంది. అతని చేతిని తన చేతుల్లోకి తీసుకొని మృదువుగా చుంబించి "1 4 3 3" అంది తియ్యగా.

అంటే 'ఐ లవ్ యూ టూ' అని అర్థం!

☆